## 26. మధురాంతకం రాజారాం

“నేను రాయలసీమకు చెందిన ఒక గ్రామీణ రచయితను. అక్కడి ప్రజలు, వాళ్ళ బాధలు ,సుఖదుఃఖాలు మొదలైనవాటి గురించి కథలు ద్వారా వ్యక్తపరుస్తూ వచ్చాను.సత్యం, శివం, సుందరం అయిన భగవత్ స్వరూపానికి ప్రతిరూపంగా మానవతను ప్రతిష్ఠించుకుని నేనెన్నుకున్న కథా కుసుమాలతో పూజిస్తాను” అని ఎంతో వినయంగా, సౌమ్యంగా తన కథా ప్రపంచం గురించి చెప్పుకున్న కథకుడు మధురాంతకం రాజారాం గారు.

ఉపాధ్యాయ వృత్తిని స్వీకరించి ఉద్యోగరీత్యా పల్లెటూర్లలో, పేటల్లోనూ నివసించిన మధురాంతకం రాజారాం గారు, తన యాభై సంవత్సరాల రచనా జీవితంలో 300కు పైగా కథలు రచించి తెలుగు పాఠకులకు ఆత్మీయులు అయ్యారు. వీరి కథలలో ప్రధానంగా మధ్యతరగతి, దిగువ మధ్యతరగతి,శ్రామిక వర్గాలకు సంబంధించిన మనుషుల జీవిత చిత్రణ ఉంటుంది.

వీరు రచించిన “జీవన్ముక్తుడు” అనే కథ శిల్పం రీత్యా చాలా గొప్పది. ఈ కథలో జీవన్ముక్తుడు గంగన్న. అతడి శ్రమైక జీవనమే

అతని నిశ్చింతకు, జీవన్ముక్తికి సోపానం అని రచయిత అభిప్రాయం. ఆధిక్యతాభావంతో విర్రవీగే మనుషుల్లో ఉండే హీనత్వాన్ని చూపుతూ రచించిన కథ "జగమేలే పరమాత్మా, ఎవరితో మొరలిడుదు"అన్నది. రాజారాం గారు తనకు తెలిసిన జీవితాన్ని గురించి చేయాలనే నిజాయితీకి కట్టుబడి ఉన్నారు. సాహిత్యం కొన్ని కర్తవ్యాలను నెరవేర్చాలని వారు బలంగా విశ్వసించారు. రాజారాం గారి కథా కథన విధానం కొంత విలక్షణమైనది. వీరి కథల్లో వ్యర్థమైన ప్రారంభాలు, పూసుపోని ప్రారంభాలు ఉండవు. ప్రారంభానికి, ముగింపుకి సంబంధం ఉండేలా వారి కథలు కనిపిస్తాయి. భాగ్య విధాతలు అన్న కథ **"ఆరోజు నేను భయపడ్డాను**"అనే వాక్యం తో ప్రారంభమవుతుంది. ఎందుకు భయపడ్డాడో తెలియాలంటే కథ చివరి వరకు చదివి తీరాల్సిందే.

మధురాంతకం రాజారాం గారి కథలు అన్నీ వర్ణనాత్మకంగా సాగుతాయి. వీరి కథల్లో మరొక లక్షణం పతితులు పట్ల, భ్రష్టుల పట్ల సానుభూతిని కలుగజేయడం.

దళితుల సమస్యలను చిత్రించి వారిని చైతన్యవంతులుగా మార్చినది అజ్ఞాతవాసం కథ. రాజారాం గారు రచించిన అరచేతిలో గ్లోబు లేఖా కథన పద్ధతిలో ఉంటుంది. " గ్లోబు అరచేతికి వస్తే

సరిపోతుందా? జీవితం లోని ఆనందం రావద్దా” అన్నది ఈ కథకి ముగింపు . రాజారాం గారు ఉత్తమ పురుషులో అనేక కథలు రచించారు .తమ అభిప్రాయాలను, గుణాలను రాజశేఖరం పాత్ర ద్వారా వ్యక్తం చేయడానికి అన్ని కథల్లోనూ ఒకే పేరు పెట్టారు.

“ కుంపట్లో కుసుమం, కాటుకకంటినీరు, తాను వెలిగించిన దీపాలు ,సర్కసుడేరా,వగపేటికి నేతి, వక్ర గతులు మొదలైనవి వీరి కథల్లో ప్రసిద్ధమైనవి. వీరి కథలు మనుషుల పట్ల, మనిషిలోని మంచితనం పట్ల, మానవత్వం పట్ల విశ్వాసాన్ని కలిగిస్తాయి .మనిషి మనిషిగా జీవించడంలో గొప్ప సౌందర్యం ఉంది అనే భావనను కలిగిస్తాయి. 1999 ఏప్రిల్ 1న రాజారావుగారు భౌతిక ప్రపంచాన్ని విడిచి వెళ్ళిపోయారు. అయినప్పటికీ ఉత్తమ సాహితీవేత్తగా వీరు ఆంధ్ర లోకానికి చిరంజీవులు.